

# ఎగిరే పక్షులు

'దివ్య'

ఈ వారం కథ





"జయా! ఎంత అదృష్టం. అకస్మాత్తుగా ఏమిటీ రాక!" అంటూ అన్నపూర్ణ నన్ను కౌగలించుకుంది.

"అక్కయ్య కూతురి పెళ్ళికి వచ్చాను. నిన్ను చూడకుండా వెళ్ళను కదా. నీ ఉత్తరం కూడా అందింది" అన్నాను. ఇద్దరం కూర్చున్నాము.

ఐదేళ్ళలో ఆ డ్రాయింగ్ రూమ్‌లో పెద్ద మార్పు లేదు. ఒక్క టి.వి. తప్ప.

"పిల్లలు ఏరి? రూప లేదా?" అనడిగాను.

"రూప ఉద్యోగం చేస్తోంది. రేఖ హాస్టల్లో వుండి మెడిసిన్ చదువుతోంది. బాబు కాలేజీకి వెళ్ళాడు' ' అంది.

"నువ్వు రూప పెళ్ళి గురించి బాగా బెంగ పెట్టుకున్నావనిపించింది నీ ఉత్తరం చూస్తే" అన్నాను. నేను చెప్పదలచుకున్న దానికి ప్రస్తావన తెస్తూ.

"ఔను. బెంగగానే వుంది. దాన్ని ఒక మంచివాడి చేతిలో పెట్టగలుగుతానో లేదోనని. నువ్వు ఇప్పుడే వెళ్ళిపోవాలి అనవు కదూ. రూప భోజనానికి ఇంటికి వస్తుంది. అందరం కలిసి భోజనం చేద్దాం. మా అత్తగారికి భోజనం పెట్టి ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది అన్నపూర్ణ. మా ఇద్దరి మధ్య ఎంత స్నేహం వున్నా అన్నపూర్ణ ఎప్పుడూ తన ఇంటి సమస్యల్ని గురించి ఉత్తరాలలో ఏమీ రాసేది కాదు. వాళ్ళది మామూలు మధ్య తరగతి కుటుంబం. ఎన్నో ఘర్షణలు వుంటాయి. ఐనా అన్నపూర్ణ నిండుకుండ. అటువంటిది ఈసారి తన కూతురి పెళ్ళి గురించి దిగులు పడుతూ రాసింది.

"రూప పెళ్ళి ఇట్లాగ సమస్య అవుతుంది అనుకోలేదు. రెండేళ్ళ నుంచి సంబంధాలు చూస్తున్నాము. కుదరలేదు. మేనరికం వుంది కానీ ఇష్టం లేదు. అది ఈ కాలం అమ్మాయి. సర్దుకు పోయే స్వభావం కాదు. మా తాహతుకు మించిన కట్నం ఇచ్చేనా సరే దానికి అందం, ఆస్తి వున్న ఆఫీసర్ని తేవాలని ప్రయత్నం చేస్తున్నాము. చాలీ చాలని సంపాదనలోను, బూజుపట్టిన అభిప్రాయాలతోను దాన్ని కట్టిపడేసే మహానుభావుడు వస్తే అది ఏం చేస్తుందోనని నా ప్రాణం కొట్టుకు పోతోంది. భర్త అనుకూలుడు కానప్పుడు ఆడదానికి తాళి ఉరితాడే కదూ!" అంటూ రాసింది. అప్పుడే అనుకున్నాను. అన్నపూర్ణకి నా మనసులో మాట ఇప్పుడైనా చెప్పాలని. చందూ ఇంజనీరయినప్పటి నుంచి "మా అబ్బాయికి మీ అమ్మాయిని ఇయ్యమని అడగాలనుకుంటున్నాను. సందేహిస్తూనే రెండేళ్ళు గడిచిపోయాయి. ఔనుమరి. మాకు లేకపోయినా వాళ్ళకి పట్టింపు వుండవచ్చు. చందూ ఉట్టి పిచ్చిబాబు! 'నీకు నచ్చిన అమ్మాయిని నువ్వే చూడు మమ్మీ!' " అంటాడు.

ఆయన ఐతే మరీను. కుల గోత్రాలు అవసరం లేదు. స్టేటసూ చూడరు.

"మీ అన్నపూర్ణ కూతురు బాగుంటుంది. నువ్వే అడగరాదా?" అంటాడు. నాకూ ఇష్టమే. 'ముందర రూపని చూడాలి. ఈ ఐదేళ్ళలో ఎట్లాగ...ఎంత మారిందో!' అనుకుంటుంటే రూప వచ్చింది. నన్ను గుర్తుపట్టింది.

"జయా ఆంటీ, బాగున్నారా! ఇవేళ మా అమ్మకి పండగే!" అంటూ నా పక్కన కూర్చుంది. అన్నపూర్ణ కూడా వచ్చింది.

"అమ్మ ఎప్పుడూ మీ సంగతులే చెప్తుంటుంది ఆంటీ! మీ ఫ్రెండ్ కోసం ఏం స్పెషల్ చేశావ్!" అని వాళ్ళమ్మని అడిగింది.

రూప ఇది వరకులాగ సిగ్గుపడటం లేదు. చూడగానే ఆకర్షించే రూపం! కాంతివంతమైన నవ్వు, స్నేహ పూర్వకంగా మాట్లడటం నాకు నచ్చుతున్నాయి. రూపని నా కోడలుగా ఒప్పుకోవచ్చు. నా ప్రపోజల్ ఏంటే అన్నపూర్ణ తప్పకుండా సంతోషిస్తుంది. మాలాంటి సంబంధం కుదరాలంటే ఈ రోజుల్లో ఓ లక్ష ఐనా ఖర్చు చెయ్యాలి. మాకు కట్నం అక్కర్లేదు. నచ్చిన పిల్ల దొరికితే చాలు.

"అట్ల తద్ది రోజు మీరు వెన్నెల్లో ఆడుకునేవారుట. ఏటిగట్టుకి వాకింగ్ వెళ్ళేవారుట. మీరు ఎంకిపాటలు పాడేవారుట. ఒకసారి అమ్మ మీ ఇంట్లో భోజనం చేస్తే ఇంటికి వచ్చాక మా అమ్మమ్మ వాతపెట్టిందిట. అమ్మకి..." రూప మాటలు నేను ఆనందిస్తుంటే అన్నపూర్ణ అడ్డుపడుతూ "అదెప్పుడో చిన్నప్పటి సంగతి. అప్పుడు మా నాన్నగారు మా అమ్మని చాలా కోప్పడ్డారు. తరువాత అమ్మమ్మ చాలా మారిపోయింది" అంది అన్నపూర్ణ.

"అమ్మమ్మ మారింది కానీ మీ అత్తగారు మారలేదు. మారదు. మారబోదు" అంది రూప నవ్వుతూ.

ఆ నవ్వు చూస్తుంటే పూలతోటలో తిరుగుతున్నట్టుగా వుంది నాకు.

"నీకేం, నవ్వులాటగా వుంటుంది. మాకు ప్రాణ సంకటం! ఔను జయా. ఆవిడకి పిచ్చి పట్టుదల. ఏ పరిస్థితిలోనూ ఆవిడ మారదు. ఆవిడకి మనుషులకంటె తన పూజలూ ఆచారాలూ ఎక్కువ. మా మరిది, పిల్లలూ ఎవరూ మా ఇంటికి రారు. నీకు తెలుసు. ఇదంతా మా మరిది పెళ్ళితో వచ్చింది".

"ఔను. క్రిస్టియన్ అమ్మాయిని చేసుకున్నాడు" అన్నాను గుర్తుతెచ్చుకుంటూ.

"ఈవిడ ఆ అమ్మాయిని ఈ ఇంటికి తీసుకు రావద్దంది. 'నా పక్కన కూర్చుని నా దేవుడికి పూజ చెయ్యలేనిది నా కోడలు ఎట్లాగవుతుంది?' అంది. మనిషిని చూస్తే మనసు మార్చుకుంటుంది ఆవిడ అనుకుని లూసీని ఇంటికి తీసుకొచ్చాడు మా మరిది. ఆ అమ్మాయి అత్తగారితో తనే సర్దుకోటానికి సిద్ధపడింది. ఆ రోజు ఈవిడ అన్నం తినలేదు. నిద్ర మాత్రలు మింగింది. డాక్టర్లు ఎట్లాగో ప్రాణాలు నిలబెట్ట గలిగారు. అప్పటి నించి ఈ ఇంట్లో ఎవరూ ఆవిడకి వ్యతిరేకంగా ఏ పని చెయ్యటానికీ సాహసించం. నా విషయంలో నాకు బాధలేదు. కానీ పిల్లల విషయంలో అట్లాగ ఊరుకోలేక పోతున్నాను" అంది అన్నపూర్ణ తన బాధని వ్యక్తం చేస్తూ.

"నన్ను ఉద్యోగం చెయ్యనివ్వటం, రేఖని హాస్టల్లో వుంచి చదివించటం, అమ్మ సాధించిన రెండు ఘన విజయాలు. మరి ఆంటీకి ఆ మధ్య జరిగిన పెళ్ళి చూపుల కథ వినిపించవా?" అంది రూప నవ్వుతూ.

అన్నపూర్ణ మొహం వివర్ణమైంది.

"ఒక జరిగిన సంగతి చెప్పటానికి అంత భయమెందుకు?" అంది రూప మళ్ళీ.

"ఏమీ లేదు జయా. రూపకి ఒక సంబంధం వచ్చింది. వాళ్ళకి కట్నం ఇచ్చే బదులు నన్నే చదివించకూడదా అంటుంది. ఎట్లాగో ఒప్పించాను. అందరికీ అన్నీ నచ్చాయి. తాంబూలాలు తీసుకోటానికి వస్తామన్నారు. అప్పుడు తెలిసింది. వాళ్ళు మా శాఖ కాదుట! ఎట్లాగ పొరపాటయిందో మరి. సంబంధం తెచ్చినాయన మీకు పట్టింపు వుండదనుకున్నాను అన్నాడు. మా అత్తగారు వీల్లేదు అన్నారు. ఆయన వాళ్ళమ్మ మాటకి ఎదురు చెప్ప లేదు. మంచి సంబంధం చెయ్యి జారిపోయింది" అంది అన్నపూర్ణ.

"తాంబూలాలప్పుడు ఇవ్వటానికి పెళ్ళికొడుకు కోసం ఉంగరం, సూటూ కూడా కొన్నారు నాన్నగారు. పాపం!" పకపకా నవ్వింది రూప.

రూప ఎలా నవ్వగలుగుతోంది!

నా మొహం మీద పేడ నీళ్ళు కొట్టినట్టు కంపరంగా వుంది నాకు.

ఇంత శాఖ పట్టింపు వున్న వాళ్ళు కులం అడ్డుగోడ ఎట్లా దాటగలరు? నయం. ముందరే తెలిసింది. అన్నపూర్ణని అడిగి బాధ పెట్టలేదు.

రూప టేబుల్ సర్దింది. భోజనాలకి కూర్చున్నాము. మనసులో దిగిన ముల్లుతో కాలం కుంటుతూ నడుస్తోంది. ఎదురుగా వున్న బెడ్ రూమ్ కర్టెను తీసి ఒక ముసలావిడ అన్నపూర్ణ అత్తగారు అయి వుంటుంది.

"ఎవరే వాళ్ళు? మన వాళ్ళేనా?" అని ప్రశ్నించింది కళ్ళు చిట్లించి చూస్తూ.

"ఆ! మనవాళ్ళే" అంది అన్నపూర్ణ. ఆవిడ లోపలికి వెళ్ళింది.

"చూడండి ఆంటీ! మా అమ్మా నాన్నగారు నా భవిష్యత్తుని ఈవిడ చేతిలోనే పెట్టారు" అంది రూప అట్లా నవ్వుతూనే.

నేను అన్నపూర్ణ వైపు చూడలేదు. భోజనాలు ముగిశాయి.

"నేను ఆంటీని ఆటో ఎక్కించి, ఆఫీసుకి వెడతాను" అంది రూప.

"వెళ్ళి వస్తా"నని అన్నపూర్ణకి చెప్పి నేను రూప రోడ్డు మీదికి వచ్చి నిలబడ్డాం. స్మార్ట్‌గా వున్న ఒక యువకుడు స్కూటరు మీద వచ్చి మా దగ్గర ఆగాడు.

"ఇతను మనోజ్ ఆంటీ. నా కొలీగ్. రోజూ నాకు లిఫ్ట్ ఇస్తాడు" అని నాతో అని

"నువ్వు వెళ్ళు. నేను ఆంటీని ఆటో ఎక్కించి వస్తాను" అంది అతడితో రూప.

రూపం మీద నుంచి తన చూపుల్ని బలవంతంగా లాక్కుంటూ వెళ్ళాడు అతడు.

"నేను మీతో మాట్లాడాలి ఆంటీ!" అంది రూప.

కొంచెం అర్థమవుతున్నా, నాతో ఏం మాట్లాడాలీ అని ఆశ్చర్యం వేసింది నాకు.

"చూశారు కదూ మనోజ్‌ని! అతడితో ఏడాది నించి పరిచయం వుంది నాకు. నా బలహీనతలు అతడికి తెలుసు. అతడి మంచి పాయింట్స్ నాకు తెలుసు. మేమిద్దరం ఉద్యోగాలు చేసుకుంటూ సుఖంగా బ్రతకగలం. నా డబ్బు నేను ఎట్లగ ఖర్చు పెట్టుకున్నా అతడికి అభ్యంతరం లేదు. బాగా తెలిసి నచ్చినవాడు ఇతణ్ణే కాదని ఎవరినో ఎందుకు చేసుకోవాలి? వాడు రోగిష్టో, విమెనైజరో, ఇంబెసైలో! తరవాత ఇద్దరికీ పడకపోతే? ఆ బాధ నేనెందుకు భరించాలి?

ఇతడు మా కులం కాదు: ఆ భేదం నిజంగా మా సుఖానికి అడ్డుకాదు. నా సుఖం ఎందులో వుందో అమ్మకి తెలియటం లేదు. కట్నంతో అన్నీ కొనాలనుకుంటోంది. పూజలూ వ్రతాలూ చేస్తోంది. మీరు చెప్తే అర్థం చేసుకుంటుంది ఆంటీ. ప్లీజ్, అమ్మని మీరు ఒప్పించండి!" ఆ పిల్ల కళ్ళలో వేడికోలు. నన్ను కరిగించేస్తోంది. రూపని నా కోడల్ని చేసుకుందామనుకున్నాను కట్నం లేకుండా. కానీ రూపని ఎవరూ ఉద్ధరించనవసరం లేదు. అది–బలమైన రెక్కల్ని పెంచుకుని ఎగిరే పక్షిని తెచ్చి పంజరంలో పెట్టడమే! కానీ అన్నపూర్ణ! నాలో కలిగిన నిరాశా నిస్పృహల్నించి తేరుకుంటూ

"అట్లాగే చెప్తాను రూపా. కానీ మీ అమ్మ ఒప్పుకోకపోతే!"

"బాధలేని జీవితం వుంటుందా, ఆంటీ? జీవితంలో బాధ ఒక భాగం. బాధపడకుండా అమ్మకి మీరే నచ్చ చెప్పాలి" అంది రూప. ఆటో వచ్చి ఎదురుగా ఆగింది. ఎడ్రస్ చెప్పి ఎక్కాను.